# అశ్లీల నిషేధం

**కొడవటిగంటి కుటుంబరావు**

అశ్లీల సాహిత్యాన్ని, బొమ్మలనూ, సినిమాలనూ చట్టరీత్యా నిషేధించటం అసంగతమని ఇటీవల ఇంగ్లండులో తేల్చారు. చట్టం చెయ్యటమైతే సాధ్యమేకాని దాన్ని సమర్థించటంలో చాలా చిక్కు వస్తున్నది.

మొదటి సంగతి, ఏది బూతు అన్నది న్యాయశాస్త్ర రీత్యా నిర్వచించటం సాధ్యంకాదు. ఏది అవాచ్యమో, అలేఖ్యమో నిర్ణయించేది సమాజం. సమాజం అంతాకూడా కాదు. "శిష్టులు" అనిపించుకునే వర్గాలవారు. వాళ్ళు ఏది నోటంట అనరో, వినరో, చదవరో, చూడరో - కనీసం నలుగురి మధ్య అననట్టూ, విననట్టూ, చదవనట్టూ, చూడనట్టూ నటిస్తారో - అది బూతు; అశ్లీలం.

నిజానికి నగ్న శరీరాలు అందరికీ తెలిసినవే. జననేంద్రియాల పేర్లు ఎవరికీ కొత్తకాదు. కాని పదిమంది మధ్య ఒక నగ్న శరీరం కనిపించినా ఒక జననేంద్రియం పేరు వినిపించినా "శిష్టులు" కంపించి పోతారు. "బూతు" మాటలను ఊత మాటలుగా రోజుకు వంద సార్లు వాడే వాళ్ళకు ఏ వికారమూ ఉండదు.

శిష్టులనబడే వారిలోకూడా అందరూ స్త్రీలే ఉన్నప్పుడు నగ్నంగా కనిపించటానికి ఏ స్త్రీకీ సాధారణంగా అభ్యంతరం ఉండదు. ఎంత మడిగట్టుకున్న దంపతులైనా ఏకాంతంలో "బూతు" మాట్లాడకుండా ఉండరు.

అందుచేత "బూతు", "అశ్లీలం" అన్నది స్ఫురించటం ఒక "కండిషన్డ్ రిఫ్లెక్స్." అది కొందరికి కొన్ని పరిస్థితులలో కలుగుతుంది, అందరికీ అన్ని పరిస్థితులలోనూ కలగదు. అదిసూచించటానికే "అసభ్యం" అనే మాట పుట్టింది.

అజంతా చిత్తరువులు చూస్తుంటే ఏ వికారమూ కలగకపోవచ్చు. కాని అజంతా సుందరి దుస్తులు ధరించినస్త్రీ వీధిలో కనబడితే నానారకాల వికారాలు కలగవచ్చు. నూటికి పదిమంది స్త్రీలు అదేవిధంగా తయారైతే క్రమంగా వికారాలు సమసిపోవచ్చు. మనలెక్కన అసభ్యంగా వస్త్రధారణచేసే పాశ్చాత్య దేశాలలోనే "మినిస్కర్ట్స్" కొత్తగా వచ్చినప్పుడు సంచలనం కలిగింది. ఇప్పుడాసంచలనం సన్నగిల్లిపోయింది.

ఆ కారణంచేత "జుగుప్స" అనేది ఒక సుస్థిర భావంకాదు. మొదట అసభ్యం అనిపించినది కాలక్రమమున నిర్వికారమైపోయి, మరికొంత కాలానికి సభ్యంగాకూడా పరిణమించవచ్చు. అలాంటి సంచలనమైన విలువలను చట్టరీత్యా నిషేధించటం సాధ్యంకాదు.

అసభ్య-అశ్లీల శృంగారంవల్ల కలిగే "హాని" నిరూపించటం అసాధ్యమని వాదిస్తున్నారు. అలాంటి రచనలూ, చిత్రాలూ, సినిమాలూ కామోద్రేకాన్ని రెచ్చగొడతాయి. నిజమే. కాని కామోద్రేకం కలగటం అన్నది ఒక నేరంకాదు. అది ప్రతిమనిషికీ సహజంగా కలగవలసినదే. దాన్ని పెంపొందించే ఆహారాలూ, ఔషధాలూ, ప్రక్రియలూ నిషిద్ధాలు కావు. అందుకుగాను ఉపయోగించే కొన్ని డ్రగ్గులు ఆరోగ్య కారణాలదృష్ట్యా ఆదివరకే నిషేధించబడి ఉన్నాయి.

సెక్సుపుస్తకాలూ, బొమ్మలూ- సినిమాలూ వ్యభిచారాన్ని పెంపొందిస్తాయన్న ఆరోపణ ఉన్నది. వ్యభిచారం అంతో ఇంతో అదుపులో వుంటున్నదంటే దానికి కారణం సంఘ నిషేధమే గాని చట్టనిషేధం కాదు. రంకుతనాలు జరుగుతూనే ఉన్నాయి. కాని కేవలమూ రంకుపోయినందుకెవరూ జైళ్ళకుపోవటంలేదు. వ్యభిచారవ్యాపారం నిషేధించబడింది. ఆ సందర్భంలో చట్టాన్ని ఉల్లంఘించినవారికి శిక్ష పడుతున్నది.

నిజానికి అశ్లీలం ఒకవ్యాపారం. సెక్సు పుస్తకాలూ, పత్రికలూ, ఫొటోలూ, సినిమాలూ విజృంభించటంలో సాంఘికపరిణామం ఏమీలేదు. కేవలమూ డబ్బుకోసమే ఇవి సృష్టిఅవుతున్నాయి. వీటిని చట్టంద్వారా నిషేధిస్తే ఈవ్యాపారం చీకటి బజార్లను ఆశ్రయించి మరింత లాభదాయకం అవుతుంది.

నిషేధం లేకపోతే అయిదు రూపాయలకు దొరికేబూతు పుస్తకం నిషేధం మూలంగా 25 రూపాయిలు పెడితేగాని దొరకదు. మామూలు ఫొటోలకన్న బూతు ఫొటోలధర జాస్తి.

ఈ సందర్భంలో డెన్మార్క్‌లో జరిగిన ఒక సంఘటన తెలుసుకోదగినది. అక్కడ బూతు పుస్తకాలమీద. బొమ్మలమీదా నిషేధం ఉండేది. 1967 జూనులో కాబోలు బూతు పుస్తకాలపై నిషేధం తీసేశారు. వెంటనే వాటి అమ్మకాలు తగ్గిపోయాయి. బూతు బొమ్మల అమ్మకాలు పెరిగాయి- వాటిపై నిషేధాన్ని అక్కడి ప్రభుత్వం ఎత్తివెయ్యలేదు.

సాంఘిక పరిణామం వల్ల కలిగే మార్పులు మరోవిధంగా వుంటాయి. ప్రబంధాల నిండా వచ్చి శృంగారమూ, రతివర్ణనలూ ఉన్నాయి. కాని వాటిని గురించి ఎవరూ పెద్దగా ఆందోళనా చెయ్యలేదు. ఎందుచేత వాటిలో ఉండే భాష మనం "బూతు"గా భావించే భాష లాంటిదికాదు. ప్రబంధాలలో కూడా స్త్రీల అంగాంగ వర్ణనవున్నది. కాని అది ఒక అనవాయితీ ప్రకారం జరిగింది. ఆ ప్రబంధ భాషతో కామోద్దీపన కలిగించటం దాదాపు సాధ్యంకాని పరిస్థితి ఏర్పడింది.

అందుకే సెక్సుకు సంబంధించిన "ఇన్హిబిషన్స్" తొలగించటానికి కంకణం కట్టుకున్న చలంగారు కూడా ఒకరకమైన "సభ్యతను" పాటించటం జరిగింది. ఆయన "చన్నులు" అనేమాట ఎక్కడా వాడినట్టు లేదు, "మెడకింది వాపులు" అన్నారు. ప్రబంధాలతో పోల్చితే చలంగారి సెక్సు వర్ణనలు ఎంతో సభ్యమైనవని ఒప్పుకు తీరాలి. ఆయన సెక్సును అమ్మలేదు. ఈనాటి కొందరు సినిమా ప్రొడ్యూసర్లలాగా, సెక్సు పత్రికల వాళ్ళలాగ ఆయన తన రచనలను వ్యాపార సరుకు చెయ్యలేదు. అయినా మడిగట్టుకున్నవాళ్ళు ఆయన రచనలుచూసి అల్లాడిపోయారు. సెక్సును బజారులోపెట్టి అమ్ముకునే వాళ్ళతో మడిగట్టుకున్న వాళ్ళకు పేచీ లేదు; దాని సంకెళ్ళను విడగొట్టటానికి పూనుకున్న వాళ్ళంటేనే భయమూ, కంపరమూనూ!

మనజాతికి సెక్సు విక్రయం గురించి ఏమైనా అభ్యంతరం ఉన్నదా ? ఎంత మాత్రమూ లేదు. ఇమ్మోరల్ట్రాఫిక్ చట్టం ద్వారా ఆడదాన్ని అదుపులో పెట్టిందిగాని, దాదాపు ప్రతి మగవాడూ తన సెక్సును కట్నానికి అమ్ముకుంటున్నాడు. ఇది ఘనంగా భావించబడుతున్నది. సినిమా తెరమీద స్త్రీ పాత్రలు ఆ కాసిన గుడ్డలూ విప్పదీసుకుని డాన్సులు చేసినా నోరు మెదపటానికి మనం అశక్తులంకాము.

నిషేధాలు ఉండరాదని నేను అనటంలేదు. సాంఘిక నిషేధాలు చాలా అవసరం. సభ్యత విడిచిపెట్టిన తరవాత సమాజమే ఉండదు. కాని ఈ నిషేధాలు సెన్సారు ద్వారానూ, చట్టాల ద్వారానూ అమలుజరగవు. సినిమాలలో ఎంత అశ్లీలం సహించాలో ప్రేక్షకులు నిర్ణయిస్తారు. నిర్ణయిస్తున్నారనే నావమ్మకం. విజయవంతంగా నడిచేవన్నీ "క్లీన్"గా ఉన్న చిత్రాలేనని తెలుస్తున్నది. అలాగే పుస్తకాలలో కూడా సభ్యతకు విరుద్ధమైన సెక్సు ఎక్కరాదు.

పదిమంది సిగరెట్లు కాల్చేవాళ్ళ మధ్య పొగ సరిపడని పెద్దమనిషి ఒక్కడున్నా పదిమందీ ఆత్మనిగ్రహం ప్రదర్శించటం మర్యాద. ఈ విషయంలో మెజారిటీ, మైనారిటీ విచక్షణలేదు. ఏ నాగరిక సమాజంలోనైనా అల్ప సంఖ్యాకులపట్ల హెచ్చు ఆదరం ఉంటుంది. సినిమాలు తీసే వాళ్ళూ, పుస్తకాలు అచ్చువేసే వాళ్లూ నిజమైన నాగరికతా గలవాళ్ళయితే ఈ నిషేధాల ప్రసక్తే అవసరం లేకపోను, కాని ఈనాటి ప్రపంచంలో డబ్బుకున్న విలువ నాగరికతకు ఉండటంలేదు.

★

Source: Press Academy Website, Pragathi Patrika, December 1969

**Disclaimer:** This topic/article/write-up has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan
http://www.maganti.org/